అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి బదిలీ

సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్,మల్కాజిగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ)విజయేందర్‌రెడ్డి బదిలీ అయ్యారు. దాదాపు రెండేళ్లుగా ఇక్కడ అడిషనల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనను నారాయణపేట జిల్లా అడిషనల్ కలెక్టర్‌గా బదిలీ చేస్తూ.. గురువారం ప్రభుత్వ రెవెన్యూ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో ఇప్పటి వరకు ఎవ్వరినీ నియమించలేదు. మేడ్చల్ జిల్లాలో రెవెన్యూశాఖలో ప్రభుత్వం చేపట్టిన భూ భారతి కార్యక్రమంలో ఆయన కీలకంగా పనిచేశారు.

యూత్ కాంగ్రెస్ నేతలకు మూడ్రోజుల శిక్షణ



శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి

కీసర: రాహుల్‌గాంధీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'వైట్ టీషర్ట్ ' ఉద్యమానికి నాంది పలుకుతూ రాంపల్లి దాయరాలోని బాల వికాస కేంద్రంలో మూడ్రోజుల పాటు యువజన కాంగ్రెస్‌నేతలకు నిర్వహించే శిక్షణ శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే శిబిరంలో యువజన కాంగ్రెస్ నేతలు, కరుణ, ఐక్యత, అహింస, సమానత్వం, అందరికీ పురోగతి అనే అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిబిరంలో జిల్లా అధ్యక్షుడు, అసెంబ్లీ అధ్యక్షుడు, మండల అధ్యక్షులు, తదితరులు హాజరయ్యారు.

వరాహాల అపహరణ.. కేసు నమోదు

పోచారం: పందులు అపహరణకు గురైన ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. పోచారం మున్సిపాలిటీలోని కొర్రెముల్‌కు చెందిన బిజిలి మహేష్ బుధవారం రాత్రి తనకు ఉన్న 10 వరాహాలను షెడ్‌లో పెట్టి ఇంటికెళ్లాడు. గురువారం ఉదయం షెడ్డులో ఉండాల్సిన పందులు కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా కనిపించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి సేవించిన కేసులో నలుగురి రిమాండ్

మల్కాజిగిరి: గంజాయి సేవిస్తున్న నలుగురిని మల్కాజిగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సై గణేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 21న రాత్రి వాణీనగర్ స్ట్రీట్ నెం2లో నలుగురు యువకులు గంజాయి సేవిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించి వారిని అదుపులోకి తీసుకున్నారు. గత కొంతకాలంగా గంజాయి సేవిస్తున్నామని, పరశురాం అనే వ్యక్తి వద్ద కొనుగోలు చేస్తున్నామని విచారణలో తెలిపారు. శివకుమార్, పవన్‌కుమార్, హేమంత్, నందుల వద్ద 10 గ్రాముల గంజాయి, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని గురువారం రిమాండ్‌కు తరలించామన్నారు. పరశురాం పరారీలో ఉన్నట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



సత్యానంద పాణిగ్రాహి

మల్కాజిగిరి: వ్యక్తి అదృశ్యమైన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై కొండలు తెలిపిన వివరాల ప్రకారం... ఒడిశాకు చెందిన సత్యానంద పాణిగ్రహి(47) ఆర్టీసీకాలనీలో నివాసం ఉంటూ.. సెంట్రింగ్ పనిచేస్తున్నాడు. ఈనెల 19న తన అల్లుడు హేమరాజ్‌తో కలిసి కాంట్రాక్టర్ శివారెడ్డితో పనికివెళ్లాడు. 20న జెడ్‌టీసీ క్రాస్‌రోడ్స్ వద్ద శివారెడ్డి బైక్‌పై ముగ్గురు జెడ్‌టీసీ క్రాస్‌రోడ్స్ వద్దకు వచ్చారు. ట్రాఫిక్ పోలీసులు ట్రిపుల్ రైడింగ్ వెళ్తే పట్టుకుంటారని, మొదట హేమరాజ్‌ను ఇంటి వద్ద దింపివస్తానని అక్కడే ఉండమని సత్యానందకు చెప్పాడు. తిరిగొచ్చిన శివారెడ్డికి సత్యానంద కనిపించలేదు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ రావడంతో అతడి అల్లుడికి సమాచారం అందించాడు. హేమరాజ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దోమల నివారణకు ప్రత్యేక కార్యాచరణ

మల్కాజిగిరి: దోమల నివారణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. గురువారం ఎంటమాలజీ విభాగం సిబ్బందితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. వర్షాకాలం ప్రారంభంకావడంతో దోమలు పెరిగే అవకాశం ఉందని ఫాగింగ్‌పై దృష్టి సారించాలని సూచించామన్నారు. డివిజన్ పరిధిలోని కాలనీలన్నింటిలో ఫాగింగ్ చేసేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. సూపర్‌వైజర్ నజీర్, సిబ్బంది పాల్గొన్నారు.

ముందుకు పడని అడుగులు !

● శిథిల భవనంలో తహసీల్దార్ కార్యాలయం ● నూతన భవనానికి శంకుస్థాపన చేసినా.. ● పనుల్లో కనిపించని పురోగతి

ఓ వైపు కొన్ని శాఖల్లో అవసరం లేకున్నా అదనపు భవనాలను నిర్మిస్తూ.. తమ శాఖల కార్యాలయాల కోసం సువిశాల భవనాలు ఏర్పాటు చేసుకుంటుంటే మండల రెవెన్యూ కార్యాలయం మాత్రం నిజాంకాలం నాటి శిథిల భవనంలోనే కొనసాగుతోంది. – మేడ్చల్



శిథిల భవనంలోనే తహసీల్దార్ కార్యాలయం

పట్టణ నడిబొడ్డున మేడ్చల్ మండల తహసీల్దార్ కార్యాలయం ఉంది. ఈ కార్యాలయం భవనం నిజాంకాలంలో గుర్రాల కోసం నిర్మించిన భవనం కాగా.. కాలక్రమేనా మొదటి నుంచి మండల రెవెన్యూ కార్యాలయం కొనసాగుతూ వచ్చింది. ఈ భవనంలో ఉన్న సమితి కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్, టెలికాం కార్యాలయాలు కాలక్రమేనా భవనం పురాతనమైనది కావడంతో నూతన భవనాల్లోకి ఎన్నో ఏళ్లక్రితమే మారిపోయాయి. రెవెన్యూ కార్యాలయం మాత్రం శిథిల భవనంలోనే కొనసాగుతుండటం గమనార్హం.

ఇరుకు గదులతో ఇబ్బంది..

కార్యాలయంలో గదులు ఇరుకుగా ఉండటంతో పాటు శిథిలావస్థకు చేరుకోవడంతో అధికారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రికార్డు గది పూర్తిగా శిథిలం కావడంతో రికార్డులకు భద్రత కరువైంది. వర్షం కురిసిన ప్రతిసారి సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మరమ్మతులు చేపట్టినా ముప్పే..

అధికారులు ఎప్పటికప్పుడు భవనానికి మరమ్మతులు చేపట్టినా.. పాత భవనం కావడంతో ఎప్పటికైనా ముప్పేనని పలువురు అభిప్రాయపడుతున్నారు.

జాడలేని పక్కా భవనం..

ఉమ్మడి రాష్ట్ర చివరి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి మేడ్చల్ తహసీల్దార్ కార్యాలయం పక్కా భవనం కోసం 2014లో శంకుస్థాపన చేసిన అది ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. కనీసం శిలాఫలకం జాడకూడా కనిపించడం లేదు. కనీసం స్థలం ఎక్కడ కేటాయించారో తెలియని పరిస్థితి నెలకొంది. పాత భవనంలో సువిశాల స్థలం ఉండటంతో ఆ ప్రాంతంలోనే నూతన భవనాన్ని నిర్మించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

మండల పరిషత్‌లోకి..

గ్రామాలు మున్సిపాలిటీలుగా మారడంతో మేడ్చల్‌లో ఉన్న జిల్లా పరిషత్, మండల పరిషత్ కార్యాలయాల భవనాలు ఖాళీ కానున్నాయి. అద్దె భవనంలో ఉన్న జిల్లా రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను అక్కడకు మార్చాలని, జిల్లా కలెక్టర్‌కు ఇన్‌చార్జ్ మంత్రి శ్రీధర్‌బాబు ఇప్పటికే సిఫారస్సు లేఖ రాశారు. శిథిల భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్ భవనాన్ని పక్కా భవనంలోకి మార్చాలనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ఆనంద్‌నగర్ పార్కు ప్రభుత్వానిదే !

హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు



ప్రభుత్వ బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది

జవహర్‌నగర్: కార్పొరేషన్ పరిధిలోని సర్వేనెంబర్ 510లో వివాదాస్పదంగా మారిన నందనవనం పార్కు ప్రభుత్వ స్థలమని కాప్రా తహసీల్దార్ సుచరిత తెలిపారు. గురువారం ఆనంద్‌నగర్ పార్కు స్థలాన్ని తహసీల్దార్, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బందితో కలిసి పరిశీలించి ప్రభుత్వ బోర్డును ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సర్వే నెంబర్–510లో 15 గుంటల ప్రభుత్వస్థలాన్ని కొందరు ప్రైవేట్ వ్యక్తులు తమదని తప్పుడు పత్రాలతో న్యాయస్థానం, ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారు. ఈ క్రమంలో 2021 మే నెలలో అప్పటి కమిషనర్ గోపి ఆధ్వర్యంలో జాయింట్ కమిషన్ ఏర్పాటు చేసి ఈ స్థలంలో పంచనామా నిర్వహించినట్లు తెలిపారు. గత 20 ఏళ్లుగా ఎలాంటి నిర్మాణాలు లేవని, ప్రైవేటు వ్యక్తులు తప్పుడు ఇంటినెంబర్లతో పార్కు స్థలాన్ని తమదిగా పేర్కొంటూ న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టించారని, అప్పటి కమిషన్ స్పష్టం చేసిందని తెలిపారు. న్యాయస్థానం తీర్పు ఇచ్చే వరకు ఈ స్థలం ప్రభుత్వానిదేనని, ఎవరైనా ఆక్రమణలకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముగిసిన శ్రీరామ కల్యాణ కామేశ్వరీ బ్రహ్మోత్సవం

ఘట్‌కేసర్: ఎన్ఎఫ్‌సీనగర్ రాయగిరి కొండపై ఉన్న శ్రీరామ కల్యాణ కామేశ్వరీ నవశక్తి ఆలయ 23వ వార్షిక బ్రహోత్సవం గురువారం ఘనంగా ముగిసింది. 18న ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు పూర్ణాహుతితో పూర్తయ్యాయి. ఈ సందర్భంగా నవశక్తి అమ్మవారికి చతుషష్టి 934, కలశములు, విశేష వస్త్రాల అలంకరణ, అభిషేకం, మూలమంత్ర హోమం, మహాపూర్ణాహుతి, ధ్వజారోహణం, మహదాశీర్వచనం, తీర్థప్రసాద వితరణ తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

వ్యక్తి ఆత్మహత్య

శామీర్‌పేట్: కుటుంబకలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శామీర్‌పేట పెద్దమ్మకాలనీలో నివాసం ఉండే రాచకొండ నరేందర్ (47), క్షౌ రవృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి దూలానికి చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని, కేసును దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రాజబోల్లారంను సందర్శించిన బిహార్ సర్పంచ్‌ల బృందం



రాజబోల్లారం గ్రామంలో బిహార్ సర్పంచ్‌లు

మేడ్చల్: గ్రామాల్లో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను అధ్యయనం చేసేందుకు బిహార్ రాష్ట్రానికి చెందిన 50 గ్రామాల సర్పంచ్‌లు ఎన్ఐటీఆర్‌డీ తరపున మండలంలోని నూతన్‌కల్ రాజబోల్లారం గ్రామాలను గురువారం సందర్శించారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు, తాగునీటి సరఫరా, ఇంటింటికీ నల్లా, పల్లె ప్రకృతివనాలు, గ్రామ పంచాయతీ నిర్వహణ, రికార్డుల నమోదు, వైకుంఠధామాలు, సెగ్రిగేషన్‌షెడ్ తదితర అభివృద్ధి పనులను పరిశీలించి మండల, గ్రామ అధికారులతో సమావేశం నిర్వహించి చర్చించారు. ఎంపీడీఓ వసంతలక్ష్మి, గ్రామ ప్రత్యేకాధికారి వినూత్నరెడ్డి, గ్రామకార్యదర్శి రవీందర్‌రెడ్డి, ఎన్ఐటీఆర్‌డీ సభ్యుడు సైదిరెడ్డి, ఎంపీఓ సునీత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉద్దమర్రి విష్ణు, శివాలయ బ్రహ్మోత్సవాలు



కల్యాణమహోత్సవంలో పండితులు



ఊరేగింపులో ఆహ్వానం పలుకున్న కళాకారులు

శామీర్‌పేట్: మేడ్చల్ జిల్లా, మూడుచింతలపల్లి మండలం, ఉద్దమర్రి విష్ణు, శివాలయంలో 39వ వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉద్దమర్రిలోని అక్కన్న, మాదన్నలు నిర్మించిన అతి పురాతనమైన శ్రీవిష్ణు శివాలయంలో మూడ్రోజుల పాటు జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శివపార్వతులు, లక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణమహోత్సవాన్ని వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కనులపండువగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవతో మొదలుకొని, వాయిద్యగోష్టి, నిత్యార్చన వీరాంజనేయ స్వామివారికి సింధూర అభిషేకం జరిపిన అనంతరం శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీ వేంకటేశ్వర స్వామి, భవానీరామలింగేశ్వరస్వామి కల్యాణమహోత్సవం వైభవంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వజ్రేష్‌యాదవ్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, సమీప గ్రామాల ప్రజలు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళను చేరదీసి..

ఆశ్రమంలో చేర్పించిన పోలీసులు



ఉప్పల్: గత కొద్దిరోజులుగా ఉప్పల్ పరిసర ప్రాంతాల్లో మతిస్థిమితం లేని యువతి తిరుగుతూ రాత్రుళ్లు ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తుండేది. స్థానికులు గమనించి రాచకొండ పోలీస్ కమిషనర్‌కు సమాచారం అందించారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు గురువారం పలు ప్రాంతాల్లో వెతకగా.. ఉప్పల్ గాంధీ విగ్రహం వద్ద కనిపించింది. దీంతో ఆమెను స్టేషన్‌కు తీసుకెళ్లి సపర్యలు చేయించారు. కొత్త బట్టలు ఇప్పించి, భోజనం పెట్టించారు. పోలీసులు విచారణ చేపట్టి ఆరా తీయగా.. ఆమె తనపేరు పద్మ అని చెప్పిందని, మరే విషయాన్ని చెప్పలేదని, తెలుగు, ఇంగ్లిష్ బాషల్లో మాట్లాడుతుందని పోలీసులు వివరించారు. సదరు మహిళను అబ్దుల్లాపూర్‌మెట్‌లోని ఆలేటి ఆశ్రమంలో చేర్పించారు. కుటుంబసభ్యులెవరైనా గుర్తిస్తే ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

◆ ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాచకొండ కమిషనరేట్ మహిళలకు అత్యంత భద్రత కల్పిస్తోందన్నారు.

వాన పడితే బురద.. ఎండ కొడితే దుమ్ము

మట్టి రోడ్లతో తీవ్ర ఇబ్బంది పడుతున్న ప్రజలు



నారపల్లిలో బురదమయంగా రహదారి

పోచారం: పోచారం మున్సిపాలిటీలో అత్యధికంగా మట్టిరోడ్లు ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం పడితే బురద, ఎండలుంటే దుమ్ము.. తదితర సమస్యలు ప్రజలను పట్టి పీడిస్తున్నాయి. మున్సిపాలిటీకి భారీగా ఆదాయం ఉన్నప్పటికీ రహదారులు అధ్వానంగా మారాయి. నారపల్లి, కొర్రెముల్, చౌదరిగూడ, పోచారంలోని పలు ప్రాంతాల్లో చిన్నపాటి వర్షానికే రోడ్లపై గుంతలు పడటంతో నీరు నిలుస్తోంది. దీంతో దోమలు, ఈగలు వంటి క్రిమి,కీటకాలు వృద్ధి చెందుతున్నారు. రోడ్ల మరమ్మతులు, కొత్త రహదారుల నిర్మాణాలు చాలా రోజుల నుంచి పెండింగ్‌లో ఉండటంతో అభివృద్ధి 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించి, రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

భాగ్యరెడ్డి వర్మకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న పోచారం మున్సిపల్ అధికారులు



జవహర్‌నగర్‌లో నివాళులర్పిస్తున్న దృశ్యం

పోచారం: మున్సిపల్ కార్యాలయంలో భాగ్యరెడ్డి వర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం ఆయన చిత్రపటానికి మున్సిపల్ అధికారులు, సిబ్బంది పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘ సంస్కర్త, ఆది ఆంధ్రసభ స్థాపకులు, 1906–1933 మధ్యకాలంలో హైదరాబాద్ సంస్థానంలో 26 దళిత బాలికల పాఠశాలలను స్థాపించి, వారి అభ్యున్నతికి భాగ్యరెడ్డివర్మ చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. జగన్మిత్రమండలి, మన్య సంఘం, సంఘ సంస్కార నాటక మండలి, అహింసా సమాజాన్ని స్థాపించి హైదరాబాద్ ప్రాంతంలో సంఘ సంస్కరణలకు ఆయన చేసిన కృషిని ప్రశంసించారు. మేనేజర్లు నిర్మల, అశోక్, ఆర్ఐ సాయిరాజ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆశయాలను కొనసాగించాలి..

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ కమిషనర్ వసంత ఆధ్వర్యంలో భాగ్యరెడ్డివర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ.. దళిత సంక్షేమం కోసం పాఠశాలలు, వివిధ సంస్థలను స్థాపించి అందరికీ విద్య అందించాలనే లక్ష్యంతో హైదరాబాద్ నడిబొడ్డున ఆది హిందూభవన్‌ను ఏర్పాటు చేసిన ఘనత భాగ్యరెడ్డి వర్మదని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించాలని కోరారు. డీఈఈ మాధవాచారి, మేనేజర్ నగేష్‌బాబు, ఆర్ఓ వెంకటేశం, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులకు యూనియన్లే కీలకం



ఆందోళన చేస్తున్న సేల్స్ రిప్రజేంటివ్స్, సీఐటీయూ నేతలు

మల్లాపూర్: కార్మికులకు వ్యతిరేకంగా ప్రభుత్వం అవలంభిస్తున్న తీరుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసన చేస్తున్నామని 'తెలంగాణ మెడికల్ సేల్స్ రిప్రజేంటివ్స్ యూనియన్' ప్రధాన కార్యదర్శి భానుకిరణ్ అన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ఫ్రాంకో ఇండియా ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టామన్నారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షుడు గణేష్ మాట్లాడుతూ.. కార్మికులకు యూనియన్లు చాలా కీలకమని, హక్కులను కాపాడే సాధనంగా అవి నిలుస్తాయన్నారు. కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన నూతన కార్మికకోడ్ వల్ల కార్మికుల హక్కులు తుడిచిపెట్టే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కార్మిక నిర్ణయాలకు వ్యతిరేకంగా అన్ని రంగాల కార్మికులు జూలై 9న నిర్వహించనున్న అఖిల భారత సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రభాకర్, దుర్గాప్రసాద్, జగదీశ్వర్‌చారి, సాయిరాం, రాజ్‌కుమార్, విజయ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



సత్యసాయికాలనీలో సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సబిత

అల్వాల్: వెంకటాపురం డివిజన్ సత్యసాయికాలనీలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు రూ.45 లక్షలతో నిర్మించే సీసీరోడ్డు పనులకు గురువారం కార్పొరేటర్ సబితాఅనిల్‌కిషోర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వెంకటాపురం డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. కాలనీవాసులు నర్సాగౌడ్, రాఘవేంద్ర, నాయకులు మోసిన్, జందర్, నర్సింగ్, మురళీగౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజల్లో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్



వీరమల్లకు బయలుదేరిన హనుమాన్ మాలదారులు



శ్రీ ఆంజనేయం.. ప్రసన్నాంజనేయం

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జన్మోత్సవ వేడుకలు

శామీర్‌పేట్: తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని దేవరయాంజాల్‌లో గురువారం హనుమాన్ జన్మదినం సందర్భంగా ఆలయంలో ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించారు. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌ముదిరాజ్, నాయకులు నర్సింగ్‌రావు, యాదమ్మ, ఉమా శ్రీనివాస్, జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కీసర: కీసరగుట్ట రామలింగేశ్వరస్వామి దేవస్థానం, చీర్యాల, రాంపల్లి, ఆర్ఎల్‌నగర్, బండ్లగూడ, నాగారం, బోగారం తదితర ప్రాంతాల్లో భక్తిశ్రద్ధలతో హనుమాన్ జన్మోత్సవ వేడుకలు నిర్వహించారు.

చీర్యాల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో..

లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలోని ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృత నవ కలశాభిషేకం, మన్యసూక్త పారాయణం, వివిధ రకాల పుష్పాలు, తమలపాకులతో అర్చన కార్యక్రమాలు చేశారు. ఆలయ ఫౌండర్, చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



చీర్యాల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో..

◆ దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలో గురువారం ర్యాలీ నిర్వహించారు. నాగారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ చంద్రారెడ్డి హాజరై ర్యాలీలో పాల్గొన్నారు. మాజీ వార్డు మెంబర్ సాయినాథ్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, చారి తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: శివారెడ్డిగూడ వీరాంజనేయ ప్రసన్నాంజనేయస్వామి ఆలయం, గీతామందిర్‌లో స్వామివారికి పూజలు, హోమం, ర్యాలీ నిర్వహించారు. గీతామందిర్‌లో మాజీ చైర్‌పర్సన్ పావనీజంగయ్యయాదవ్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నప్రసాద వితరణ చేశారు. మహేష్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, మమతాగౌడ్, జంగయ్య, సంజీవగౌడ్, సత్తయ్య, పరమేశ్, గోవర్ధన్, శరత్, వెంకట్‌రెడ్డి, మాజీ చైర్మన్ మాధవరెడ్డి, అంజిరెడ్డి, రాంరెడ్డి, నర్సింహ్మారెడ్డి భక్తులు పాల్గొన్నారు.

మేడ్చల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ, మండలంలోని వివిధ గ్రామాల్లో హనుమ జన్మోత్సవం ఘనంగా నిర్వహించారు.



పూడూర్ హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు



గీతామందిర్‌లో అన్నప్రసాద వితరణ



దమ్మాయిగూడ ర్యాలీలో పాల్గొన్న చంద్రారెడ్డి